పట్టణంలో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు కృషి

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రధాన డ్రైనేజీని శుభ్రం చేసే పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మే 19: పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రధాన డ్రైనేజీలో పేరుకు పోయిన చెత్తను జేసీబీతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ ప్రధాన కాల్వ చెత్త, పిచ్చి చెట్లతో నిండి ఉండడంతో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా మారిందన్నారు. డ్రైనేజీల శుభ్రం కోసం మున్సిపల్ బడ్జెట్‌లో నిధులు వెచ్చిస్తున్నా ఎక్కడి చెత్తా అక్కడే ఉంటుందన్నారు. మున్సిపల్ నిధులు వృథా కాకుండా మున్సిపాలిటీ జేసీబీలు, కార్మికులతో కాల్వలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, నాయకులు, కార్మికులు ఉన్నారు.

క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తేవాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మే 19 : క్రీడాకారులు క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకు రావాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో నల్లగొండ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి కొద్దిసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపర్చారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య, స్టేడియం చైర్మన్ రాచకొండ శ్రీధర్, నాయకులు పన్నాల రాఘవ రెడ్డి, చౌగోని శ్రీనివాస్, చౌగోని లక్ష్మణ్, యాసారపు వెంకన్న, సైదులు, మట్టిపల్లి వీరు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి : ఎమ్మెల్యే సామేల్

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మద్దిరాల, మే 19 : అభివృద్ధి పనులను అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ నాణ్యతతో చేపట్టేలా చూడాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు కాగా ఇప్పటి వరకు రూ.1.70 కోట్లతో రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఆర్ డీఈ లింగానాయక్, తాసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏఓ అనీసా రూహి, వివేక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చెరువులు నింపేలా చర్యలు తీసుకోవాలి

● మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు

సమావేశంలో మాట్లాడుతున్న మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు

మిర్యాలగూడ, మే 19: నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని చెరువులను కృష్ణా జలాలతో నింపేందుకు వీలుగా ప్రత్యేక తూములు, కాల్వలు ఏర్పాటు చేయాలని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సాగర్ ఎడమకాల్వ కింద ఉన్న చెరువుల మేజర్, మైనర్ కాల్వల ద్వారా పంట పొలాలకు నీరు రాక సుమారు 60 ఏండ్లు కావస్తున్నదన్నారు. దాంతో రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరందక ఎండిపోయే దుస్థితి నెలకొంటున్నదని పేర్కొన్నారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో సాగునీరందక రైతులు అరిగోస పడ్డారని, ఇప్పుడు అలాంటి పరిస్థితే ఉందన్నారు. సాగర్ ఎడమ కాల్వకు నీళ్లు వస్తున్నా, చెరువుల్లో నీరు చేరక వాటి కింద సాగు చేసిన రైతులు సాగునీటి కోసం బోర్లు వేసుకొనే దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని చెరువులు నింపి, వాటి కింది ఆయకట్టుకు సాగునీరందేలా చూడాలని కోరారు. సమావేశంలో జల్లి రోషయ్య, గురవయ్య, గంగయ్య, రాజు పాల్గొన్నారు.

పోడు భూముల సమస్యను పరిష్కరించాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

చందంపేట(నేరేడుగొమ్ము), మే19 : పోడు భూముల సమస్యను పరిష్కరించి రైతులకు పట్టాలివ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నేరేడుగొమ్ము మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ 4వ మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మండలంలో లిఫ్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రంలో తరుగు పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని, తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. యాసాని పాండురంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, నాయకులు పల్లె నర్సింహ, సుదర్శన్ రెడ్డి, పాండురంగారెడ్డి, బొమ్ము అచ్చయ్య, రమేశ్, రామాంజనేయులు, భిక్షం, బెజవాడ లక్ష్మయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FOR RENT
shutter with open land for rent, 380Sqyd, 1st lane, Raghavendra Colony, New Vision School back side, Nalgonda. Good for godowns Contact: 8008987068.
NLG

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777636
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | తొలుకట్ట: 9182777636

కార్మికులు న్యాయ చట్టాలను వినియోగించుకోవాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పురుశోత్తమరావు

సమావేశంలో మాట్లాడుతున్న పురుశోత్తమరావు

రామగిరి, మే19 : అసంఘటిత రంగ కార్మికుల కోసం అనేక న్యాయ చట్టాలున్నాయని, వాటి గురించి తెలుసుకొని, సద్వినియోగం చేసుకోవాలని, కార్మికశాఖ వాటిని పటిష్టంగా అమలు చేసేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.పురుశోత్తమరావు సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థలో సోమవారం అసంఘటిత రంగ కార్మికులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులకు సరైన పని పరిస్థితులు కల్పించాలని, వారి భద్రత, వేతనాలు, మౌలిక సదుపాయాలు అందించాలని సూచించారు. కార్మికులను ఇబ్బంది పెట్టే యాజమాన్యాలపై లేబర్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాల ద్వారా హక్కులను కాపాడుకోవచ్చని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. సమావేశంలో లేబర్ అధికారి రాజు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నిమ్మల భీమర్జున్‌రెడ్డి, కార్మికులు ఆచారి, రవి, మధార్, లేనిన్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్సీ కోటిరెడ్డి పరామర్శ

త్రిపురారం, మే 19: మండలంలోని రాగడప మాజీ సర్పంచ్ బొల్లం వెంకటేశ్వర్లుయాదవ్ మాతృమూర్తి దుర్గమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి గ్రామానికి వెళ్లి దుర్గమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కలకొండ వెంకటేశ్వర్లు, పోషబోయిన సైదయ్య, పానుగోతు రాందాస్, మాదా వెంకటేశ్వర్లు, పొట్టిపాక రవికుమార్, ఈశ్వరయ్యచారి, బొల్లం సైదయ్య, వెంకటేశ్వర్లు, భిక్షం పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డిబార్

రామగిరి, మే 19: ఎంజీయూ పరిధిలోని కళాశాలల్లో నిర్వహిస్తున్న డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం ఉమ్మడి జిల్లాలో ముగ్గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయ్యారు. ఉదయం జరిగిన 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 5,461 మంది విద్యార్థులకు గానూ 5,132 మంది హాజరు కాగా 236 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌కేఎల్‌కే డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా ఆయా పరీక్ష కేంద్రాల స్క్వాడ్ బృందాలు డిబార్ చేసినట్లు సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 990 మంది హాజరు కావాల్సి ఉండగా 901 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ

రామగిరి, మే 19 : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈ నెల 20 నుంచి 24 వరకు మండల స్థాయిలో శిక్షణ ఉంటుందని డీఈఓ భిక్షపతి, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి ఆర్.రామచంద్రయ్య సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శిక్షణలో కంటెంట్ ఎన్‌రిచ్‌మెంట్, డిజిటల్ ఎడ్యుకేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్ స్కిల్స్, లెర్నింగ్ అవుట్ కమ్స్ వంటి అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉదయం 9:30 లోగా రిపోర్టు చేయాలని సూచించారు. శిక్షణకు హాజరుకాని వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కారు అదుపుతప్పి మహిళ మృతి

తిప్పర్తి, మే19 : కారు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లడంతో మహిళ మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని కేశరాజుపల్లి శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన కల్లేపల్లి శ్రీనివాస రాజు భార్య పుణ్యలక్ష్మి, మరదలు తిరుమలరాజు సుజాతతో కలిసి కారులో బాపట్ల జిల్లా నాగండ్ల గ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యంలో కేశరాజుపల్లి గ్రామ శివారులో శ్రీనివాస్ మీటర్ రీడింగ్ చూస్తుండగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న సేఫ్టీ పిల్లర్స్‌ను ఢీకొట్టి కిందికి దూసుకెళ్లింది, దాంతో కల్లేపల్లి పుణ్యలక్ష్మి(54)కి తీవ్రంగా, శ్రీనివాస్‌తో పాటు అతని మరదలు సుజాతలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పుణ్యలక్ష్మి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయమై శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

చందంపేట(దేవరకొండ), మే 19 : దేవరకొండ నియోజకవర్గంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేశ్ డిమాండ్ చేశారు. దేవరకొండలో ఏర్పాటు చేసిన ఖమ్మం శ్రీచైతన్య పాఠశాల అడ్మిషన్ సెంటర్‌కు సోమవారం విద్యాశాఖ అధికారులతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు తాళం వేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య పాఠశాలకు ప్రభుత్వ అనుమతి లేదని అధికారులు ప్రకటించినా పాఠశాల యాజమాన్యం ముందస్తుగా అడ్మిషన్ల కోసం ప్రచారం చేయడం విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేయడమే అన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

తుర్కపల్లి, మే 19 : మండలంలోని వాసాలమర్రి గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ బొమ్మలరామారం మండలం సోలిపేటకు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌ను గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది సన్మానించారు.

డీఈఓపై చర్యలు తీసుకోవాలని ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం నాయకులు

రామగిరి, మే 19: నల్లగొండ డీఈఓ అక్రమాలకు పాల్పడుతున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయ సంఘం జిల్లా నేతలతో కలిసి డీఈఓ అవినీతి భాగోతం నడిపిస్తున్నారని ఆరోపించారు. పదో తరగతి మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయన్నారు. గుండ్రాంపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి స్పౌజ్ నల్లగొండ జిల్లాలో లేకున్నా స్పౌజ్ పాయింట్లు ఇప్పించి బదిలీలో ఇక్కడికి వచ్చేలా చేశారన్నారు. ఇదే విషయం బయట పడడంతో సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసి ఉపాధ్యాయ సంఘం నేత సహకారంతో అదే పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. ఇలా అక్రమ డిప్యూటేషన్స్, పాఠశాలలకు హాజరు కాకున్నా టీచర్లకు వేతనాలు ఇప్పించడం వంటివాటికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. డీఈఓపై చర్యలు తీసుకొని జిల్లాలో విద్యావ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, సంఘం నాయకులు సైదానాయక్, అల్లంపల్ల కొండన్న, వినోదాచారి, కాసర్ల లింగస్వామి, సూర్యనవీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందిస్తున్న చేస్తున్న తాసీల్దార్ రఘు, నాయకులు

హాలియా, మే 19 : అనుముల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 132 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద మంజూరైన రూ.1.32 కోట్ల విలువైన చెక్కులను సోమవారం మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో తాసీల్దార్ రఘు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డ పెండ్లి తల్లిదండ్రులకు భారం కావద్దనే ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, పాండు నాయక్, నాయకులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించాలి

● మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం

మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం

నిడమనూరు, మే 19 : సాగులో ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సాగులో మెళకువలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించి అధిక దిగుబడులు సాధించేందుకు దోహద పడాలన్నారు. అనంతరం కంపసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.లింగయ్య, డాక్టర్ వి.శ్రీధర్ సాగులో యూరియా మోతాదును తగ్గించడం, పంట మార్పిడి, సాగునీటి ఆదాపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హాలియా ఏడీఏ ఎం.సరిత, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ అధికారి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి నర్సింహాచారి, ఏఈఓ విజయచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకం

● సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల

పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

రామగిరి, మే19: ప్రజల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. సోమవారం సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలను నల్లగొండలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయుధ రైతాంగ పోరాటంలో సుందరయ్య అగ్రభాగంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు చినపాక లక్ష్మీనారాయణ, ఎండీ సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, తుమ్మల పద్మ, దండెంపల్లి సత్తయ్య, పోలే సత్యనారాయణ, పరిపూర్ణాచారి, అరుణకుమారి పాల్గొన్నారు.

మిర్యాలగూడ : పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శ నాయకుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఈదులగూడెం వద్ద సుందరయ్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, జ్యోతి ఆస్పత్రి ఎండీ డాక్టర్ మువ్వా రామారావు, నాయకులు పాల్గొన్నారు.

మర్రిగూడ తాసీల్దార్‌గా శ్రీనివాస్

మర్రిగూడ, మే 19 : మండల తాసీల్దార్‌గా జక్కర్తి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తాసీల్దార్‌గా పని చేసిన బక్క శ్రీనివాసులు మహబూబ్ నగర్ జిల్లాకు బదిలీపై వెళ్లగా సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం తాసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ బదిలీపై మర్రిగూడకు వచ్చారు. పలువురు అధికారులు, నాయకులు శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అద్దంకి హైవేపై కారు బీభత్సం

● స్కూటీ, రెండు బైక్‌లు ధ్వంసం
● ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

నార్కట్‌పల్లి, మే 19 : మద్యం మత్తులో ఉన్న వ్యక్తి అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై కారును అతివేగంగా నడుపుతూ స్కూటీతో పాటు మరో రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. దాంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఎల్లారెడ్డిగూడెం సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ నుంచి నార్కట్‌పల్లి వైపు వస్తున్న కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉండి కారును వేగంగా నడుపుతూ ఎల్లారెడ్డిగూడెం సమీపంలో స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దాంతో స్కూటీపై ఉన్న మండంలోని అక్కెనపల్లి గ్రామానికి చెందిన సునీల్‌కుమార్(33) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత కూడా కారు ఆపకుండా అతివేగంగా వెళ్తూ ముందుగా వెళ్తున్న మరో రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. దాంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సునీల్ కుమార్ మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొనడంతో ధ్వంసమైన స్కూటీ

వృద్ధురాలిపై దాడి చేసి నగలు దోచుకున్న నిందితుల అరెస్ట్

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నీలగిరి, మే19 : ఈ నెల 17న నకిరేకల్‌లోని వీటీ కాలనీలో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిపై దాడి చేసి ఆమె నగలను ఎత్తుకెళ్లిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. వారి నుంచి మూడు తులాల బంగారు గొలుసు, నాలుగు రోల్డ్‌గోల్డ్ గాజులు, మూడు సెల్‌ఫోన్లు, హోండా యాక్టీవాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నకిరేకల్ పట్టణంలోని వీటీ కాలనీలో ఒంటరిగా ఉంటున్న నాగులంచ లక్ష్మమ్మ ఇంటికి ఈ నెల 17న గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇల్లు అద్దెకు కావాలని అడగ్గా తమ ఇంట్లో గదులు లేవని ఆమె సమాధానమిచ్చింది. తమకు మంచినీరు కావాలని వారు అడగడంతో వృద్ధురాలు ఇంట్లోకి వెళ్లగా ఆమె వెంట లోపలికి వెళ్లిన నిందితులు గదిలోని దుప్పటిని చింపి దాంతో ఆమె నోరు, కాళ్లు, చేతులు కట్టేశారు. ఆమెపై పిడిగుద్దులు గుద్దుతూ ఆమె ఒంటిపైన ఉన్న మూడు తులాల బంగారు గొలుసు, నాలుగు రోల్డ్‌గోల్డ్ గాజులు తీసుకొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడు ప్రత్యేక పోలీసులు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం తిప్పర్తి బ్రిడ్జి వద్ద హోండా యాక్టీవాపై ఇద్దరు వ్యక్తులు వెళ్తూ పోలీసులను చూసి పారిపోయారు. దాంతో వారిపై అనుమానంతో పోలీసులు వెంబడించి పట్టుకొని తనిఖీలు చేపట్టారు. వారి వద్ద పుస్తెలతాడు దొరకడంతో అదుపులోకి తీసుకొని మరింత లోతుగా విచారణ చేపట్టారు. వారు హైదరాబాద్‌కు చెందిన సత్యారం కృష్ణ, మామిడి బాలకృష్ణగా గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు. వారు నకిరేకల్‌కు చెందిన మల్లం నర్సింహ, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ముష్టి వెంకటేశ్‌తో కలిసి నకిరేకల్‌లో వృద్ధురాలి ఇంట్లోంచి దొంగిలించినట్లు నిందితులు నేరం ఒప్పుకున్నారు. నిందితుల్లో మల్లం నర్సింహ పరారీలో ఉన్నాడు. సత్యారం కృష్ణపై 31, మామిడి బాలకృష్ణపై 13, ముష్టి వెంకటేశ్‌పై ఒక దొంగతనం కేసులు ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. దొంగతనాల కేసులో చంచల్‌గూడ జైలుకు వెళ్లిన క్రమంలో వీరి మధ్య స్నేహం ఏర్పడింది. నకిరేకల్‌కు చెందిన నర్సింహతో కలిసి ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఇంట్లో దొంగతనం చేసేందుకు 20 రోజుల క్రితమే ప్రయత్నించారు. అప్పుడు వీలు కాకపోవడంతో ఈ నెల 17న దొంగతనం చేసినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐలు లచ్చిరెడ్డి, శివ, డి.సైదులు, సాయి